ప్రజాశక్తి
బుధవారం 20 డిసెంబరు 2023
5
శ్రీకాకుళం



లింగ నిర్ధారణ పరీక్షలపై పటిష్ట నిఘా

శ్రీకాకుళం అర్బన్ : లింగ నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తున్న కేంద్రాలపై పటిష్ట నిఘా అవసరమని జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్ అన్నారు. కలెక్టరేట్‌లో గర్భస్థ పూర్వ, గర్భస్థ శిశు లింగ నిర్ధారణ (పి.సి.పి.ఎన్.డి.టి) సలహా మండలి సమావేశాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇకపై సలహా మండలి సమావేశాలు డివిజన్ స్థాయిలో నిర్వహించాలన్నారు. తక్కువ జననాలు ఉన్న మండలాల్లో ప్రత్యేక క్యాంపులు నిర్వహించాలని సూచించారు. మూడు నెలల వ్యవధిలో రిజిస్ట్రేషన్, అబార్షన్స్, డెలివరీలను పరిశీలించి కారణాలపై అధ్యయనం చేయాలన్నారు. స్కానింగ్ కేంద్రాల్లో సిసి కెమెరాల ఏర్పాటు, ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేసేలా చర్యలు చేపట్టాలన్నారు. సమావేశంలో డిఎంహెచ్ఒ బి.మీనాక్షి, జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి ఆర్.సన్యాసినాయుడు, ఎఎస్‌పి తిప్పేస్వామి, డిసిహెచ్ఎస్ శ్రీనివాస్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

అంగన్వాడీల వంటావార్పు

- ఎనిమిదో రోజుకు చేరిన సమ్మె
- పలు పార్టీలు, ప్రజాసంఘాల సంఘీభావం
- సమస్యలు పరిష్కరించే వరకు సమ్మె
- స్పష్టం చేసిన అంగన్వాడీ యూనియన్ నాయకులు
- పలాసలో అంగన్వాడీ కేంద్రాల తాళాలు పగులగొట్టిన అధికారులు
- ఇచ్ఛాపురంలో ఐసిడిఎస్ సరుకుల వాహనాన్ని అడ్డుకున్న అంగన్వాడీలు



పొందూరు : వంటావార్పులో పాల్గొన్న అంగన్వాడీలు



శ్రీకాకుళం అర్బన్ : వంటావార్పులో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే గుండ లక్ష్మీదేవి

ప్రజాశక్తి - విలేకరుల యంత్రాంగం

కనీస వేతనం రూ.26 వేలు, గ్రాట్యుటీ అమలు తదితర సమస్యల పరిష్కారం కోరుతూ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యాన అంగన్వాడీలు చేపట్టిన నిరవధిక సమ్మె మంగళవారానికి ఎనిమిదో రోజుకు చేరింది. సమ్మెలో భాగంగా వంటావార్పు, మానవహారాలు చేపట్టి నిరసన తెలిపారు. శ్రీకాకుళం నగరంలోని ఐసిడిఎస్ అర్బన్ ప్రాజెక్టు కార్యాలయం వద్ద అంగన్వాడీలు వంటావార్పు చేపట్టారు. టిడిపి మాజీ ఎమ్మెల్యే గుండ లక్ష్మీదేవి అంగన్వాడీలతో కలిసి ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అంగన్వాడీలపై అనుసరిస్తున్న మొండివైఖరి విడనాడాలన్నారు. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఇచ్చిన హామీ మేరకు అంగన్వాడీల వేతనాల పెంపుతో పాటు ఇతర సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు ఎ.మహాలక్ష్మి, అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ అధ్యక్షులు కె.కళ్యాణి, టిడిపి నగర అధ్యక్షులు ఎం.వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

ఎచ్చెర్లలో అంగన్వాడీలు మానవహారం నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సిహెచ్.అమ్మన్నాయుడు, పి.తేజేశ్వరరావు మాట్లాడుతూ అంగన్వాడీలకు వేతనాలు పెంచాలని, గ్రాట్యుటీ అమలు చేయాలని డిమాండ్ చేశారు. అంగన్వాడీల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం నెరవేర్చే వరకు సమ్మె కొనసాగుతుందని స్పష్టం చేశారు. కార్యక్రమంలో అంగన్వాడీ యూనియన్ నాయకులు వై.విజయలక్ష్మి, శారద, సరస్వతి, లలిత తదితరులు పాల్గొన్నారు.

పొందూరులో అంగన్వాడీలు వంటావార్పు చేపట్టి నిరసన తెలిపారు. విశాఖ స్టీల్‌ప్లాంట్ ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు కూన వెంకటరావు సమ్మె శిబిరాన్ని సందర్శించి అంగన్వాడీల పోరాటానికి సంఘీభావం తెలిపి రూ.వెయ్యి విరాళం ఇచ్చారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా అధ్యక్షులు సిహెచ్.అమ్మన్నాయుడు, అంగన్వాడీ యూనియన్ నాయకులు బి.జ్యోతిలక్ష్మి, జి.నాగరత్నం, ఎస్.రమణమ్మ, కె.కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

బూర్జలో ఐసిడిఎస్ కార్యాలయం వద్ద అంగన్వాడీలు వంటావార్పు చేపట్టి నిరసన తెలిపారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా కోశాధికారి ఎ.సత్యనారాయణ, అంగన్వాడీ ప్రాజెక్ట్ అధ్యక్ష, కార్యదర్శులు జ్యోతి, రాధిక తదితరులు పాల్గొన్నారు.

టెక్కలి తహశీల్దార్ కార్యాలయం వద్ద వంటావార్పు కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు నంబూరు షణ్ముఖరావు, అంగన్వాడీ యూనియన్ నాయకులు ఆర్.ఆదిలక్ష్మి, సిహెచ్.ఇందుమతి, వాణిశ్రీ తదితరులు పాల్గొన్నారు.

పలాసలో కాశీబుగ్గ ఐసిడిఎస్ ప్రాజెక్టు వద్ద అంగన్వాడీలు చేపడుతున్న సమ్మెకు ఐద్వా నాయకులు ఢిల్లేశ్వరి, భాగ్యలక్ష్మి, విశ్రాంత ఆదాయ పన్ను శాఖ డిప్యూటీ కమిషనర్ జుత్తు తాతారావు, యువసేన సభ్యులు కుత్తుం వినోద్, అగ్నికుల క్షత్రియ యూత్ ఫోర్స్ నియోజకవర్గ అధ్యక్షులు కె.శ్యామ్, మందస యూత్ ఫోర్స్ అధ్యక్షులు మురళి తదితరులు సంఘీభావం తెలిపారు.

ఆమదాలవలసలో అంగన్వాడీలు సమస్యల పరిష్కారం కోరుతూ తహశీల్దార్ గణపతిరావుకు వినతిపత్రం ఇచ్చారు. అంగన్వాడీల సమ్మెకు పిసిసి ఉపాధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే బొడ్డేపల్లి సత్యవతి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం అంగన్వాడీల సమస్యలను పరిష్కరించుకుంటే, వారితో కలిసి కాంగ్రెస్ పార్టీ పోరాటానికి సిద్ధమవుతుందని హెచ్చరించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు సనపల అన్నాజీరావు, బొడ్డేపల్లి గోవింద గోపాల్, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు కె.నాగమణి, అంగన్వాడీ యూనియన్ నాయకులు పంచాది లతాదేవి, భూలక్ష్మి, ఎం.లత తదితరులు పాల్గొన్నారు.

కోటబొమ్మాళి ఐసిడిఎస్ ప్రాజెక్టు కార్యాలయం వద్ద అంగన్వాడీలు చేపట్టిన నిరసన దీక్షలో అంగన్వాడీ యూనియన్ నాయకులు డి.సుధ తదితరులు పాల్గొన్నారు.



ఐసిడిఎస్ వాహనం అడ్డగింత

ఇచ్ఛాపురం మండలంలోని పలు అంగన్వాడీ కేంద్రాలకు తరలించేందుకు సరుకులతో వచ్చిన వాహనాన్ని అంగన్వాడీలు బెల్లుపడ వద్ద అడ్డుకున్నారు. ఐసిడిఎస్ అధికారి నాగరాణి, రెవెన్యూ, సచివాలయం, పోలీస్ సిబ్బందితో వాహనాన్ని తరలించే ప్రయత్నం చేయగా... అంగన్వాడీ కార్యకర్తలు రోడ్డుకి అడ్డంగా నిల్చొని అధికారులతో వాగ్వివాదానికి దిగారు. చివరకు పోలీసులు జోక్యం చేసుకుని అంగన్వాడీలను పక్కకునెట్టి వాహనాన్ని ముందుకు తరలించారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి లక్ష్మీనారాయణ, అంగన్వాడీ యూనియన్ నాయకులు హైమావతి, బాలమణి, విజయలక్ష్మి, జయ, ఉమ తదితరులు పాల్గొన్నారు.



తాళాలు పగులగొట్టిన అధికారులు

పలాస మండలంలోని లొద్దభద్ర, తర్లాకోట, అల్లుకోల, రెంటికోటలో అంగన్వాడీ కేంద్రాల తాళాలను ఎంపిడిఒ ఎన్.రమేష్ నాయుడు, పంచాయతీ విస్తరణాధికారి మెట్ట వైకుంఠరావు సమక్షంలో బద్దలు కొట్టారు. ఈ కేంద్రాల్లోని పౌష్టికాహారం, ఇతర సరుకులను విఆర్ఒల సమక్షంలో నమోదు చేసి సచివాలయ ఉద్యోగులకు కేంద్రాల బాధ్యతను అప్పగించారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ మాట్లాడుతూ కేంద్రాల్లో రికార్డులు లేకపోవడంతో గర్భిణులు, బాలింతలు, పిల్లలకు పౌష్టికాహారం పంపిణీ చేయలేకపోయామని, ఐసిడిఎస్ అధికారుల సమక్షంలో పంపిణీ చేస్తామని చెప్పారు.



ఎచ్చెర్లలో మానవహారం నిర్వహిస్తున్న అంగన్వాడీలు



ప్రశంసాపత్రాలు అందుకున్న పోలీసులతో ఎస్‌పి రాధిక

పెండింగ్ కేసుల దర్యాప్తు వేగవంతం

ప్రజాశక్తి - శ్రీకాకుళం

పోలీస్ స్టేషన్లలో పెండింగ్‌లో ఉన్న కేసుల దర్యాప్తును వేగవంతం చేయాలని ఎస్‌పి జి.ఆర్ రాధిక పోలీసు అధికారులను ఆదేశించారు. పెండింగ్ కేసులు, నవంబరులో నమోదైన కేసులపై జిల్లా పోలీస్ కార్యాలయంలో మంగళవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రేవ్ కేసుల్లో త్వరితగతిన దర్యాప్తు పూర్తి చేసి నిందితులపై ఛార్జిషీట్ దాఖలు చేయాలన్నారు. రానున్న పండగ రోజుల్లో దొంగతనాలకు అవకాశమున్నందున, కార్డాన్‌సెర్చ్ నిర్వహించి కొత్త వ్యక్తులపై నిఘా ఉంచాలని ఆదేశించారు. కొత్త వ్యక్తుల సమాచారం సేకరణ, అనుమానితులపై నిఘా, లాడ్జీలు, వాహనాలను విస్తృతంగా తనిఖీ చేసి నేర నివారణకు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఇంటికి తాళం వేసి దూర ప్రాంతాలకు వెళ్లేటప్పుడు ఎల్‌హెచ్ఎంఎస్ కెమెరాలు ఏర్పాటు చేసుకునేలా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ప్రమాదాల నివారణకు రోడ్డు భద్రతా నియమాలపై అవగాహన కల్పించి, మద్యం సేవించి వాహనాలు నడిపే వారిపై కేసులు నమోదు చేయాలని చెప్పారు. ముఖ్యమైన కూడళ్లలో సిసి కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని తెలిపారు. ప్రాపర్టీ నేరాల నివారణకు ప్రణాళికాబద్ధంగా పటిష్ట చర్యలు తీసుకోవాలని సూచించారు.

2023 సంవత్సరానికి గానూ ఎఎస్‌పి జె.తిప్పేస్వామి, ఎఎస్ఐ పి.ఢిల్లీరావు, హెచ్‌సి ఎస్.అప్పలరాజు, కానిస్టేబుల్ ఐ.గంగరాజుకు సేవా పతకాలను అందజేశారు. డిఐజి డిస్క్ అవార్డును డి.వి.వి సతీష్ కుమార్, సబ్ ఇన్‌స్పెక్టర్ ఎస్.సత్యనారాయణ, హెచ్‌సిలు పి.రామారావు, సిహెచ్.వెంకట సత్యం, కానిస్టేబుల్స్ బి.బాలసూర్యరాజు, కె.సింహారావు, ఎస్.రాజేష్‌రావు, పి.రుషికేష్‌కు అందజేశారు. ఎస్ఐ రిక్రూట్‌మెంట్, పలు కేసుల పరిష్కారం, సిసి కెమెరాల ఏర్పాటు, రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు తదితర అంశాల్లో ఉత్తమ పనితీరు కనబరిచిన పలువరికి ఎస్‌పి ప్రశంసాపత్రాలను అందజేసి అభినందించారు. సమావేశంలో ఎఎస్‌పిలు టి.పి విఠలేశ్వర్, జె.తిప్పేస్వామి, డిఎస్‌పిలు డి.బాలచంద్రారెడ్డి, వై.శృతి, నాగేశ్వర్ రెడ్డి, సిఐలు, ఎస్ఐలు తదితరులు పాల్గొన్నారు.

సబ్ కలెక్టర్ ఘెరావ్

ప్రజాశక్తి - కోటబొమ్మాళి

మండలంలోని అక్కయ్యవలసలో జగనన్న కాలనీలో ఇళ్ల స్థలాల పరిశీలనకు వచ్చిన టెక్కలి సబ్ కలెక్టర్ నూరుల్ కమర్‌ను గ్రామస్తులు మంగళవారం అడ్డుకున్నారు. అక్కయ్యవలసలో గతంలో సర్వే నంబరు 19లో 25 మందికి ఇళ్ల పట్టాలు మంజూరు చేశారు. ఇటీవల సర్వేలో ఈ స్థలం చెరువు గర్భంగా చూపించడంతో అధికారులు పట్టాల పంపిణీని నిలుపుదల చేశారు. దీంతో సర్పంచ్ ప్రతినిధి సంకరి జనార్ధనరావు ఆధ్వర్యాన లబ్ధిదారులు ఇటీవల పలాసలో సిఎం జగన్‌ను కలిసి సమస్యను వివరించారు. మరోసారి పరిశీలించి లబ్ధిదారులకు న్యాయం చేయాలని సబ్ కలెక్టర్‌ను సిఎం ఆదేశించారు. 25 పట్టాల్లో తొమ్మిది మంది గతంలో ఇళ్ల స్థలాలు పొందడంతో వారి పట్టాలను రద్దు చేశారు. మొత్తం సమాచారంతో అధికారులతో కలిసి సబ్ కలెక్టర్ గ్రామానికి చేరుకున్నారు. చెరువు గర్భం కావడంతో ఇక్కడ పట్టాలు ఇచ్చేందుకు అవకాశం లేదని, వేరే చోట ఇస్తామని చెప్పారు. దీనిపై ఆగ్రహించిన సర్పంచ్ ప్రతినిధి జనార్ధనరావుతో పాటు లబ్ధిదారులు మొత్తం 25 మందికీ పట్టాలు మంజూరు చేయాలని సబ్ కలెక్టర్ వాహనం ముందు బైఠాయించారు. వైస్ ఎంపిపి డి.రోజారామకృష్ణ గ్రామస్తులకు నచ్చజెప్పినా వినకపోవడంతో, అధికారులు పోలీసులకు సమాచారం ఇచ్చింది. దీంతో వేరే వాహనంలో సబ్ కలెక్టర్ తహశీల్దార్ కార్యాలయానికి వెళ్లిపోయారు. అక్కడకు చేరుకున్న పోలీసులు గ్రామస్తులను తప్పించి సబ్ కలెక్టర్ వాహనాన్ని పంపించివేశారు. సబ్ కలెక్టర్ వెంట తహశీల్దార్ జామి ఈశ్వరమ్మ, గృహనిర్మాణ శాఖ ఎఇ ఆర్.పాపినాయుడు, డిటి ఆర్.మధు తదితరులున్నారు.



సబ్ కలెక్టర్ వాహనం ముందు బైఠాయించిన గ్రామస్తులు



సమావేశంలో మాట్లాడుతున్న అప్పలసూర్యనారాయణ

ఆ నిర్ణయం సరికాదు

శ్రీకాకుళం అర్బన్ : భూ హక్కు చట్టాన్ని న్యాయస్థానం పరిధి నుంచి తప్పించడం తగదని, ఆ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని పలువురు వక్తలు డిమాండ్ చేశారు. నగరంలోని ఎన్‌జిఒ హోంలో శ్రీకాకుళం పట్టణ పౌర సంక్షేమ సంఘం ఆధ్వర్యాన రౌండ్ టేబుల్ సమావేశాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ నిర్ణయం వల్ల సామాన్య ప్రజలకు తీవ్ర నష్టం జరుగుతుందని అభిప్రాయపడ్డారు. దీనివల్ల పెత్తందారీ, భూస్వామ్య వ్యవస్థలను మళ్లీ పునరుద్ధరించినట్లు అవుతుందన్నారు. దీనిపై విస్తృతంగా చర్చలు చేసి ప్రజలను చైతన్యవంతం చేయడానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. ప్రపంచబ్యాంకు ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ సర్వే 2019 ప్రకారం ఆస్తి రిజిస్ట్రేషన్ విషయంలో ఇండియా 154వ స్థానంలో ఉందన్నారు. 66 శాతం సివిల్ కేసులు, భూమికి సంబంధించిన కేసులు కోర్టులో ఉన్నాయని, వీటి సత్వర పరిష్కారం కోసం ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ చట్టాన్ని తెచ్చామని ప్రభుత్వం కల్లబొల్లి కబుర్లు చెప్తోందని దుయ్యబట్టారు. సివిల్ కేసులు సత్వర పరిష్కారం కావాలంటే ప్రస్తుతం ఉన్న కోర్టులను బలోపేతం చేస్తూ మౌలిక వసతులు, ఉద్యోగుల సంఖ్య పెంపు, ఇతర వసతులు, అదనపు నిధులను ప్రభుత్వం సమకూర్చాలన్నారు. న్యాయవ్యవస్థను పటిష్టపరిచే చర్యలకు పూనుకోవాలని హితవు పలికారు. సామాన్య ప్రజలకు వ్యతిరేకమైన చట్టాలను రద్దు చేసే వరకు పోరాడాలని సమావేశంలో తీర్మానించారు. సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు భవిరి కృష్ణమూర్తి అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో మాజీ మంత్రి గుండ అప్పలసూర్యనారాయణ, ఐలు జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు డి.రమణారావు, ఎం.అప్పారావు, సాహితీ స్రవంతి జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాసు, వ్య.కా.స జిల్లా కార్యదర్శి జి.సింహాచలం, రైతుసంఘం జిల్లా కార్యదర్శి రామకృష్ణ, ఎఐటియుసి నాయకులు చిక్కాల గోవిందరావు, పెన్షనర్ల సంఘం నాయకులు డి.పార్వతీశం, కె.సూరయ్య, బిసి సంఘం నాయకులు బి.చంద్రపతిరావు తదితరులు పాల్గొన్నారు.

అన్ని అంగన్వాడీ కేంద్రాలు తెరవాలి

కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

జిల్లాలోని అన్ని అంగన్వాడీ కేంద్రాలు తెరవాలని కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ అధికారులను ఆదేశించారు. ఎంపిడిఒలు, మున్సిపల్ కమిషనర్లు, సిడిపిఒలతో మంగళవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో 3,358 అంగన్వాడీ కేంద్రాలకు గానూ 58 శాతం కేంద్రాలు తెరుచుకున్నాయని తెలిపారు. రాష్ట్ర సగటులో ఇది చాలా తక్కువని, బుధవారం నాటికి శత శాతం కేంద్రాలు తెరుచుకునేలా సంబంధిత యంత్రాంగం పనిచేయాలని స్పష్టం చేశారు. సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు అందుబాటులో ఉన్నారని వారు ఆయా కేంద్రాలకు ఇన్‌ఛార్జీలుగా పనిచేయాలని ఆదేశించారు.

నందిగాం మండలంలో ఒక్క కేంద్రం కూడా తెరుచుకోలేదన్నారు. రాజీ మార్గంలో మాట్లాడి కేంద్రాలు తెరుచుకునేలా ప్రయత్నించాలని, లేకుంటే బలవంతంగానైనా తాళాలు తెరవాలన్నారు. ఇచ్ఛాపురం, పలాస, పాతపట్నం సిడిపిఒల పనితీరుపై అసంతృప్తి వ్యక్తం చేశారు. వీడియో కాన్ఫరెన్స్‌లో అసిస్టెంట్ కలెక్టర్ రాఘవేంద్ర మీనా, ఐసిడిఎస్ పీడీ బి.శాంతిశ్రీ, డిఆర్‌డిఎ పీడీ విద్యాసాగర్, సచివాలయాల నోడల్ అధికారి వాసుదేవరావు, జెడ్‌పి సిఇఒ ఆర్.వెంకట్రామన్ తదితరులు పాల్గొన్నారు.

'పంచతంత్ర'తో ఉత్తీర్ణతా శాతం పెంపు

సమగ్ర శిక్ష ఎస్‌పిడి బి.శ్రీనివాసరావు

ప్రజాశక్తి - రణస్థలం, లావేరు, గార

పదో తరగతి, ఇంటర్ విద్యార్థులకు వంద రోజుల కార్యాచరణలో భాగంగా సమగ్ర శిక్ష రూపొందించిన 'పంచతంత్ర' విద్యార్థుల ఉత్తీర్ణతా శాతం పెంచేందుకు దోహదపడుతుందని సమగ్ర శిక్ష రాష్ట్ర పథక సంచాలకులు బి.శ్రీనివాసరావు అన్నారు. రణస్థలం, లావేరు మండలాల్లోని కెజిబివిలు, గార మండలంలోని వమరవల్లి డైట్ కళాశాలను మంగళవారం సందర్శించారు. రణస్థలం కెజిబివిలో యూనిసెఫ్ ఆధ్వర్యంలో ఎలక్ట్రానిక్, ఆర్ట్, క్రాఫ్ట్ పరికరాలతో కూడిన 'కాస్ట్‌మేకర్ స్పేస్' సైన్స్ ప్రయోగశాలలను ప్రారంభించారు. వమరవల్లి డైట్ కళాశాలలో రీహేబిటేషన్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (న్యూఢిల్లీ) ఆధ్వర్యాన ప్రత్యేక ఉపాధ్యాయులకు వృత్తిపరమైన, మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా వికలాంగ విద్యార్థులకు బోధనా విధానం, వారికి సమగ్ర శిక్ష కల్పించే సౌకర్యాలు తదితర అంశాలపై రెండు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. 'ఇన్‌క్లూజివ్ ఆంధ్రప్రదేశ్-2025' కార్యక్రమంలో భాగంగా వికలాంగ విద్యార్థులకు అందజేసిన ప్రత్యేక సాఫ్ట్‌వేర్‌తో ఇన్‌స్టాల్ చేసిన ట్యాబ్‌ల పనితీరును అడిగి తెలుసుకున్నారు. ప్రత్యేక అవసరాలు గల విద్యార్థులకు సాధారణ విద్యార్థులతో పాటు శిక్షణ, విద్యా కార్యక్రమాలు అందించడం ద్వారా అభ్యసన సామర్థ్యాలు పెంపొందించాలని సూచించారు. డైట్ కళాశాలలోనే అమెరికన్ ఇండియన్ ఫౌండేషన్ సంస్థ ఏర్పాటుచేసిన 'స్టెమ్ ఇన్నోవేషన్ అండ్ లెర్నింగ్ సెంటర్' లో టీచర్ కార్నర్, స్టూడెంట్ ల్యాబ్ ప్రారంభించి, డైట్ గ్రంథాలయాన్ని, ప్రయోగశాలలను పరిశీలించారు. కార్యక్రమంలో సమగ్ర శిక్ష జిల్లా అదనపు పథక సమన్వయకర్త డాక్టర్ ఆర్.జయప్రకాష్, డైట్ కళాశాల ప్రిన్సిపాల్ తిరుమల చైతన్య, యూనిసెఫ్ ప్రతినిధి టి.సుదర్శన్, విజ్ఞానాశ్రమ్ ప్రతినిధి వెంకటేష్, సుమిత్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



వమరవల్లి డైట్ కళాశాలలో సైన్స్ ల్యాబ్‌ను పరిశీలిస్తున్న శ్రీనివాసరావు

వైసిపి నేతలను వెంటాడుతున్న భయం

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

తెలుగుదేశం పార్టీకి ప్రజల్లో పెరుగుతున్న ఆదరణను చూసి వైసిపి నాయకులకు ఓటమి భయం పట్టుకుందని మాజీ మంత్రి, టిడిపి సీనియర్ నాయకులు ఎస్.జవహర్ అన్నారు. నగరంలోని టిడిపి జిల్లా కార్యాలయంలో మంగళవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నాలుగున్నరేళ్ల పాలనలో ప్రజల కష్టాలు పట్టించుకోని ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి తెరచాటు పర్యటనలతో కాలం వెళ్లబుచ్చారని విమర్శించారు. ప్రశ్నించే వారిపై అక్రమ కేసులు బనాయించారని ధ్వజమెత్తారు. జగన్ ప్రభుత్వానికి రోజులు దగ్గర పడ్డాయని, వచ్చే ఎన్నికల్లో గద్దె దింపడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారని చెప్పారు. జగన్ మంత్రులు, ఎమ్మెల్యేలు, జిల్లాల ఇన్‌ఛార్జీలను మార్చినంత మాత్రాన మళ్లీ అధికారంలోకి రాలేరని తెలిపారు. వై నాట్ 175 అన్న జగన్ ఎందుకు ఇంతమందిని మారుస్తున్నారని ప్రశ్నించారు. యువగళం ముగింపు సభకు పెద్దసంఖ్యలో యువత, టిడిపి శ్రేణులు, అభిమానులు తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో టిడిపి నగర అధ్యక్షులు మాదారపు వెంకటేష్, టిడిపి జిల్లా ఉపాధ్యక్షులు పి.ఎం.జె బాబు, ఎస్.సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధికి బ్యాంకర్ల తోడ్పాటు అవసరం

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

రైతులు, మహిళలకు సకాలంలో రుణాలు అందజేయడం ద్వారా ఆర్థిక సాధికారత సాధించేందుకు దోహదపడాలని కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ బ్యాంకర్లను కోరారు. ఎంఎస్ఎంఇలకు విరివిగా రుణాలు మంజూరు చేసి పారిశ్రామికాభివృద్ధికి తోడ్పాటు అందించాలన్నారు. జిల్లాపరిషత్ సమావేశ మందిరంలో బ్యాంకర్లతో 2023-24 ద్వితీయ త్రైమాసిక జిల్లాస్థాయి సమీక్షా సమావేశాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సెప్టెంబరు నాటికి రైతులు, కౌలు రైతులకు రుణాలు మంజూరు చేయకపోవడం వల్ల లక్ష్యాలు సాధించలేకపోయారని తెలిపారు. రైతులకు బ్యాంకర్లు సహకరించకపోతే ప్రైవేటు అప్పులను ఆశ్రయించి నష్టపోవాల్సి వస్తుందని గుర్తు చేశారు కౌలు రైతులకు రుణాలు ఇచ్చేందుకు ప్రభుత్వం నిబంధనలు సడలించినా, కొన్ని బ్యాంకులు సహకరించడం లేదన్నారు. బ్యాంకర్ల సహకారం లేకపోవడంతోనే ఎంఎస్ఎంఇ లక్ష్యాల సాధనలోనూ వెనుకబడ్డామన్నారు. బ్యాంకర్లు త్వరితగతిన రుణాలు మంజూరు చేయకపోవడం వల్ల ప్రజలు పథకాలను వినియోగించుకోలేకపోతున్నారని పశు సంవర్ధక శాఖ జెడి కిషోర్ కుమార్ తెలిపారు. టిడ్కో గృహ రుణాల మంజూరుకు అడ్డంకులు తొలగించాలని గృహనిర్మాణ శాఖ అధికారులు ప్రస్తావించారు. దీనిపై కలెక్టర్ స్పందిస్తూ వచ్చే సమావేశం నాటికి బ్యాంకుల వారీగా మంజూరైన పథకాలు, చెల్లించిన రుణాలు, పెండింగ్ దరఖాస్తుల జాబితాలను అందజేయాలని ఎల్‌డిఎం ఎం.సూర్యకిరణ్‌ను ఆదేశించారు. సమావేశంలో యుబిఐ రీజనల్ హెడ్ ఎం.వి తిలక్, ఆర్‌బిఐ ఎజిఎం పూర్ణిమ, డిసిసిబి మేనేజర్ వరప్రసాద్, నాబార్డు డిడిఎం కె.వరప్రసాద్, పలు శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

భూ హక్కు చట్టాన్ని రద్దు చేయాలి

ప్రజాశక్తి- ఆమదాలవలస

ఆంధ్రప్రదేశ్ భూహక్కుల చట్టం (ఎపి ల్యాండ్ టైటిలింగ్ యాక్టు 27/2023) అక్టోబరు 31 నుంచి అమల్లోకి వచ్చినట్లు ప్రభుత్వం గుట్టు చప్పుడు కాకుండా జిఒ నంబరు 512ను జారీ చేసిందని, ఇది ఒక నల్ల చట్టమని, ప్రభుత్వం వెంటనే రద్దు చేయాలని ఆలిండియా లాయర్స్ యూనియన్ (ఐలు) రాష్ట్ర కమిటీ సభ్యుడు బొడ్డేపల్లి మోహనరావు డిమాండ్ చేశారు. బార్ అసోసియేషన్ అధ్యక్షులు చాపర విజయలక్ష్మి ఆధ్వర్యాన పట్టణంలోని ప్రధాన రహదారిపై మంగళవారం ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ చట్టం అమల్లోకి వస్తే మొట్టమొదటగా నష్టపోయేది పేదలు, దళితులు, బలహీన వర్గాల వారేనని నినదించారు. తాజాగా ఈ చట్టం తీసుకురావాల్సిన అవసరం ఏమి వచ్చిందని ప్రభుత్వాన్ని నిలదీశారు. పేదల భూములను అక్రమ రికార్డులతో ఆక్రమించే భూ కబ్జాదారులకు ఇది ఉపయోగపడుతుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. భూ హక్కులు, స్థిరాస్తి హక్కుల వివాదాలను పరిష్కరించే సివిల్ కోర్టులను పక్కనపెట్టి రెవెన్యూ అధికారులకు బాధ్యతలను అప్పజెప్పడమంటే అందులోని లోగుట్టు అర్థమవుతున్నదని న్యాయవాదులు నినదించారు. కార్యక్రమంలో న్యాయవాదులు సాధు ధనుంజయరావు, కింతలి త్రినాథరావు, అల్లాడ విజయ్ కుమార్, హనుమంతు అచ్చంనాయుడు, బూర్లె సీతారాం, బి.గోవిందరాజు, పివిఎస్, తమ్మినేని అన్నంనాయుడు, రమణారావు పాల్గొన్నారు.



ధర్నా చేస్తున్న న్యాయవాదులు

బకాయిల విడుదలకు కృషి చేయాలి

రెవెన్యూ మంత్రి ధర్మానకు యుటిఎఫ్ వినతి

శ్రీకాకుళం: ఉద్యోగులకు, ఉపాధ్యాయులకు, పెన్షనర్లకు ప్రతినెలా 1న జీతాలు చెల్లించే విధంగా నిబంధనలు ఉన్నా... రెండేళ్లుగా ఈ నిబంధనలు ప్రభుత్వం ఉల్లంఘిస్తుందని యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్.కిషోర్‌కుమార్ అన్నారు. మంత్రి క్యాంపు కార్యాలయంలో రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావును మంగళవారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 15వ తేదీ వచ్చినా ఇప్పటికీ చాలా మందికి జీతాలు చెల్లించలేదని వివరించారు. దీనివల్ల ఉద్యోగులు, ఉపాధ్యాయులు తీవ్ర ఇబ్బందులకు గురి అవుతున్నారు. బ్యాంకు లోన్లు కలిగిన వారికి ప్రతినెలా సకాలంలో వాయిదాలు చెల్లించనందున పెనాల్టీ కట్టాల్సిన పరిస్థితి ఏర్పడుతుందన్నారు. ఈ ఏడాది ఆగస్టు 24న జరిగిన ఉద్యోగుల జాయింట్ స్టాఫ్ కౌన్సిల్ సమావేశంలో పిఆర్‌సి, డిఎ అరియర్లు, పిఎఫ్, ఎపిజిఎల్‌ఐ, సరెండర్ లీవులు తదితర బకాయిలను సెప్టెంబరు నెలాఖరులోగా చెల్లిస్తామని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. కానీ, మూడు నెలలు గడిచినా ఎటువంటి పురోగతి లేదన్నారు. ఇచ్చిన హామీలపై ఆర్థికశాఖ అధికారులకు పలుమార్లు విన్నవించినా ఎటువంటి ఫలితం లేదని చెప్పారు. జిల్లాలో ఇప్పటి వరకు 2,300 మంది ఉద్యోగులకు, ఉపాధ్యాయులకు పిఎఫ్ బకాయిలు ఉన్నాయని అన్నారు. దీనిపై మంత్రి సానుకూలంగా మాట్లాడుతూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శితో మాట్లాడి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. మంత్రిని కలిసిన వారిలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు చౌదరి రవీంద్ర, జిల్లా కార్యదర్శి హనుమంతు అన్నాజీరావు, జిల్లా నాయకులు కె.సురేష్‌కుమార్, కె.వెంకటరావు ఉన్నారు.


వినతిపత్రం అందజేస్తున్న యుటిఎఫ్ నాయకులు

రేపు వక్తృత్వ, క్విజ్ పోటీలు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

జాతీయ వినియోగదారుల దినోత్సవం-2023 గాను విద్యార్థుల్లో చైతన్యం తీసుకొచ్చేందుకు అవగాహన కల్పించాలని జెసి ఎం.నవీన్ సూచించారు. కలెక్టరేట్‌లో వినియోగదారుల దినోత్సవ నిర్వహణపై మంగళవారం సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజల్లో వినియోగదారుల హక్కులపై పూర్తిస్థాయి అవగాహన కల్పించేందుకు ఏటా పెద్దఎత్తున ప్రభుత్వం కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అందులో భాగంగా ఈ ఏడాది విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు నగరంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఉదయం పది గంటలకు వక్తృత్వ, క్విజ్ పోటీలను నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. సమావేశంలో పౌర సరఫరా సంస్థ మేనేజరు శ్రీనివాసరావు, డిఎస్‌ఒ వెంకటరమణ పాల్గొన్నారు.

రాజేశ్వరరావు అవయవదానం

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్


రాజేశ్వరరావు (ఫైల్)

రాగోలు జెమ్స్ ఆస్పత్రిలో మరో బ్రెయిన్ డెడ్ రోగి కుటుంబ సభ్యులు అవయవదానానికి ముందుకొచ్చారు. టెక్కలి మండలం రావివలసకు చెందిన పి.రాజేశ్వరరావు (62) ఈ నెల 14న మెదడులోని రక్త నాలాలు చిట్లి పోవడంతో జెమ్స్‌లో చేరారు. ఐదు రోజులుగా వెంటిలేటర్‌పై చికిత్స అందించిన వైద్యులు చికిత్సకు ఏమాత్రం స్పందించడం లేదని నిర్ధారించుకుని అతని కుటుంబ సభ్యులతో మాట్లాడారు. పరిస్థితిని అర్థం చేసుకున్న వారు అవయవదానానికి ముందుకొచ్చారు. దీంతో అతనికి మంగళవారం శస్త్ర చికిత్స నిర్వహించి అవయవాలను జెమ్స్ వైద్యులు వివిధ ఆస్పత్రులకు గుండెను తిరుపతి స్విమ్స్, లివర్‌ను విశాఖలోని ఓ ప్రయివేట్ ఆస్పత్రికి తరలించారు. అత్యవసరంగా గుండెను జెమ్స్ ఆస్పత్రి ప్రాంగణం నుంచి హెలికాప్టర్ ద్వారా విశాఖ ఎయిర్‌పోర్టుకు తరలించి అక్కడి నుంచి తిరుపతి తీసుకెళ్లారు. అవయవదానం చేసిన రాజేశ్వరరావుకు ఆస్పత్రి సిబ్బంది ఘనంగా నివాళ్లరించి, ఆయన కుటుంబ సభ్యులను అభినందించారు.

నేడు జీడి రైతుల సమావేశం

ప్రజాశక్తి- పలాస

జీడి రైతుల సమస్యలపై జీడి రైతుల ప్రతినిధులు పిఎస్ ధనుంజయ రెడ్డితో మద్దతు ధర విషయంలో చర్చలు జరుపు నిమిత్తం రైతుల నుంచి అభిప్రాయ సేకరణ చేపడుతున్నామని జీడి రైతుల సంఘం జిల్లా కన్వీనర్ తెప్పల అజయ్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. అందులో భాగంగా కాశీబుగ్గ అమ్మ ఆశ్రమం వద్ద జీడి రైతులతో బుధవారం ఉదయం 10 గంటలకు సమావేశం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సమావేశానికి జిల్లా వ్యాప్తంగా ఉన్న జీడి, కొబ్బరి రైతులు తప్పకుండా హాజరై సలహాలు సూచనలు ఇవ్వాలని ఆయన కోరారు.


లావేరు : మోకాళ్లపై నిల్చొని నిరసన తెలుపుతున్న ఉద్యోగులు



సోంపేట : నల్లరిబ్బన్లతో నిరసన తెలుపుతున్న ఉద్యోగులు

సమగ్ర శిక్ష ఉద్యోగుల పెన్‌డౌన్

ఆమదాలవలస : సమగ్ర శిక్ష జెఎసి పిలుపు మేరకు సమగ్ర శిక్ష అభియాన్ ఉద్యోగులు ప్రధాన కార్యదర్శి బొడ్డేపల్లి నర్సింగరావు ఆధ్వర్యాన మంగళవారం పెన్‌డౌన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. మండల రిసోర్స్ భవనం వద్ద ప్లకార్డులు కార్డులు పట్టుకుని మంగళవారం నిరసన తెలిపారు. ఈ సమ్మెకు యుటిఎఫ్ మాజీ కౌన్సిలర్ బొడ్డేపల్లి జనార్థనరావు పాల్గొని సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సమగ్ర శిక్ష ఉద్యోగులకు ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. పెండింగ్ జీతాలను వెంటనే విడుదల చేయాలన్నారు. సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని ప్రభుత్వానికి డిమాండ్ చేశారు. అలాగే ఎపిటిఎఫ్ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బి.సుందరరావు, బి.మహేశ్వరరావులూ సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో ఎం.వి.రమణ, శ్రీను, శైలజ, జ్యోతి, చంద్రకళ, ధనలక్ష్మి, శ్రీను, ప్రసాద్ పాల్గొన్నారు.

సోంపేట: స్థానిక ఎంఆర్‌సి భవనంలో విధులు నిర్వహిస్తున్న సమగ్ర శిక్ష ఉద్యోగులు నాలుగో రోజు నల్లబాడ్జీలు ధరించి నిరసన కొనసాగించారు. కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని, సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ నెల 20లోగా ప్రభుత్వం స్పందించకపోతే సమ్మె చేపడుతున్నట్లు హెచ్చరించారు. కార్యక్రమంలో కార్యక్రమంలో కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

నందిగాం : కనీస వేతనం అమలు చేయాలని కోరుతూ ఎంఆర్‌సి కార్యాలయం వద్ద సమగ్ర శిక్ష ఉద్యోగులు నోటికి నల్లరిబ్బన్లు కట్టుకుని నిరసన తెలిపారు.

లావేరు : ఎంఆర్‌సి కార్యాలయం వద్ద సమగ్ర శిక్ష ఉద్యోగులు పి. మహేశ్వరరావు, సూర్యనారాయణ, అప్పలరాజు, వెంకటరావు, నాగరాజు మోకాళ్లపై కూర్చొని నిరసన తెలిపారు.

నిరుద్యోగుల సమస్యలు పట్టవా?

పలాస : సిఎం వై.ఎస్.జగన్మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన తర్వాత నిరుద్యోగ సమస్యలను గాలికి వదిలేశారని, తక్షణమే గ్రూప్-1, 2 ఉద్యోగ పోస్టులను పెంచి రీనోటిఫికేషన్ విడుదల చేయాలని ఎఐవైఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి మొజ్జాడ యుగంధర్, ఎఐవైఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు గోరు వాసు, కొన్న శ్రీనివాసరావు, ఎఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు సిహెచ్.రవిలు డిమాండ్ చేశారు. కాశీబుగ్గ గాంధీ విగ్రహం వద్ద అఖిల భారత యువజన సమాఖ్య, అఖిల భారత విద్యార్థి సమాఖ్య సంఘాల ఆధ్వర్యాన మంగళవారం ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిరుద్యోగుల వయోపరిమితిని పెంచాలని, మెగా డిఎస్‌సి నోటిఫికేషన్ విడుదల చేసి 50 వేల టీచర్ పోస్టులను భర్తీకి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఏటా జాబ్ కేలెండర్ విడుదల చేసి ఉంటే ఏ సమస్య వచ్చేది కాదని, సిఎం నిరుద్యోగుల విషయంలో మాట తప్పారని ఆరోపించారు. స్పష్టమైన హామీ ఇచ్చి నిరుద్యోగ సమస్యలను తీర్చకపోతే పోరాటాన్ని ఉధృతం చేస్తామని ప్రభుత్వానికి హెచ్చరించారు. కార్యక్రమంలో ఎఐవైఎఫ్ నాయకులు వెంకటరావు, వల్లభరావు, రామకృష్ణ, ఎఐఎస్ఎఫ్ నాయకులు గుణశేఖర్, పవన్, సూర్య, జీవన్, దను పాల్గొన్నారు.


ధర్నా చేస్తున్న ఎఐఎస్ఎఫ్ నాయకులు

పోస్టల్‌శాఖకు రెండు ప్రతిభా పురస్కారాలు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

కేంద్ర తపాలాశాఖ ఆధ్వర్యాన 2022-23 ఆర్థిక సంవత్సరానికి తపాలా జీవిత బీమా, గ్రామీణ తపాలా జీవిత బీమాకు సంబంధించి జిల్లాకు రెండు ప్రతిభా పురస్కారాలు వచ్చిననట్టు తపాలాశాఖ సూపరింటెండెంట్ పిళ్లా శ్రావణ్‌కుమార్ మంగళవారం తెలిపారు. రాష్ట్రవ్యాప్త ఉత్తమ ప్రతిభా పురస్కారాల్లో శ్రీకాకుళం డివిజన్‌కు రెండు ఎక్సలెన్సీ ప్రతిభా ఐ అవార్డులు దక్కాయని అన్నారు. ఎపి పోస్టల్ సర్కిల్ విజయవాడ కేంద్రంగా చీఫ్ పోస్టుమాస్టర్ జనరల్ వారి చేతుల మీదుగా వీటిని ప్రదానం చేస్తారన్నారు. ప్రతిభా పురస్కారాలు దక్కించుకున్న బి.షణ్ముఖరావు, ఇన్‌స్పెక్టర్ పోస్టు రూ.90 లక్షల ప్రీమియం, ఎ.శ్రీదేవి, డైరెక్టు ఏజెంట్ రూ.40 లక్షల ప్రీమియం సేకరించడం వల్లే ఈ పుస్కారాలు వచ్చాయని తెలిపారు.

రేపు చెకుముకి పరీక్ష

ప్రజాశక్తి- ఆమదాలవలస

ఈ నెల 21న ఉదయం 9.30 గంటలకు ఎంపిడిఒ కార్యాలయం ఆవరణలో జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యాన ఎంఇఒ పర్యవేక్షణలో మండల స్థాయి చెకుముకి టాలెంట్ టెస్టు పోటీ పరీక్షలను నిర్వహిస్తున్నట్లు జనవిజ్ఞాన వేదిక గౌరవ అధ్యక్షులు బొడ్డేపల్లి జనార్థనరావు, ప్రాంతీయ కమిటీ ప్రధాన కార్యదర్శి బొడ్డేపల్లి ప్రకాశరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పరీక్షలకు పట్టణ, మండల పరిధిలోని ప్రభుత్వ, ప్రయివేటు ఉన్నత పాఠశాలలకు చెందిన 8,9,10 తరగతులలో ప్రథమ స్థానంలో నిలిచిన విద్యార్థులు మాత్రమే అర్హులని తెలిపారు. చెకుముకి పోటీ పరీక్షల్లో విజయం సాధించిన మండల స్థాయి విద్యార్థులకు ఎంపిడిఒ చేతుల మీదుగా బహుమతులను ప్రదానం చేస్తామని తెలిపారు. విద్యార్థులకు మధ్యాహ్న భోజనం ఏర్పాటు చేస్తామని చెప్పారు.

యువగళాన్ని విజయవంతం చేయాలి

ప్రజాశక్తి- ఆమదాలవలస

విజయనగరం జిల్లాలోని నెల్లిమర్ల నియోజవర్గం భోగాపురం మండలం పోలిపల్లిలో టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ బుధవారం చేపట్టిన టిడిపి యువగళం ముగింపు సభలో జన సైనికులు పాల్గొని విజయవంతం చేయాలని నియోజకవర్గ ఇన్‌ఛార్జి, సమన్వయకర్త పేడాడ రామ్మోహనరావు పిలుపునిచ్చారు. మంగళవారం పట్టణంలోని జనసేన పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. జనసేన, టిడిపి పొత్తులో భాగంగా తొలిసారిగా భారీ బహిరంగ సభ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

ధర్మాన పిట్టకథలను ప్రజలు నమ్మరు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

బలహీన వర్గాల హక్కుల్ని కాపాడి, వివాదాలు పరిష్కరించే రీతిలో భూ సర్వే ఉండాలని, కానీ పేదల భూములను కొల్లగొట్టే రీతిలో ప్రభుత్వం చేపట్టిన భూ సర్వే ఉందని మాజీ మంత్రి గుండ అప్పలసూర్యనారాయణ, మాజీ ఎమ్మెల్యే గుండ లక్ష్మీదేవిలు ఆరోపించారు. అరసవల్లిలో మంగళవారం విలేకరులతో మాట్లాడారు. భూ సర్వేపై హైదరాబాద్‌లో ఉండే చంద్రబాబు, లోకేష్‌లకు ఏం తెలుసని రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు మాట్లాడడం విడ్డూరంగా ఉందన్నారు. ఆయన చెప్పే పిట్ట కథలు ప్రజలందరికీ తెలుసన్నారు. భూదందాలో ఎవరి పాత్ర ఎంతో ప్రజలకు తెలుసన్నారు. అవసరాన్ని బట్టి మాట్లాడడం ధర్మానకు వెన్నతో పెట్టిన విద్యని విమర్శించారు. ప్రజల ఆలోచనలను పక్కదారి పట్టించడంలో ధర్మాన సిద్ధహస్తులని వ్యాఖ్యానిం చారు. రెవెన్యూశాఖలో ఆయన పరిజ్ఞానం ఎలా ఉంటుందో, ఏ విధంగా భూ సమస్యలు పరిష్కారం చేయిస్తారో ప్రజలకు తెలుసన్నారు.


మాట్లాడుతున్న అప్పలసూర్యనారాయణ

విద్యార్థులకు నోట్ పుస్తకాల పంపిణీ



పుస్తకాలను పంపిణీ చేస్తున్న తులసీవరప్రసాదరావు

ప్రజాశక్తి- కొత్తూరు

ఈ నెల 21న సిఎం జగన్మోహన్‌రెడ్డి పుట్టిన రోజు సందర్భంగా వారం రోజుల పాటు వేడుకలు నిర్వహిస్తున్నామని వైసిపి జిల్లా కోశాధికారి లోతుగెడ్డ తులసీవరప్రసాదరావు అన్నారు. ఇందులో భాగంగా మాసంగి ప్రాథమిక పాఠశాలలో చదువుతున్న చిన్నారులకు బుధవారం నోట్ పుస్తకాలు, పెన్సిళ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నాడు-నేడు పథకం కింద స్కూళ్ల రూపు రేఖలు మార్చి విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకం కింద మంచి పౌష్టికాహారం అందిస్తున్నారని అన్నారు. విద్యార్థులకు షూ, దుస్తులు, పుస్తకాలను ఉచితంగా అందిస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో లోతుగెడ్డ తాతబాబు, ఇందిర రామ్, సర్పంచ్‌లు కొయిలాపు శ్రీనివాసరావు, పుచ్చ అప్పారావు, అగతముడి రంజిత్‌కుమార్, పడాల వెంకటకృష్ణ, వడమ శ్రీను, చొడవరపు మోహనరావు, రేగానా తిరుపతిరావు, విద్యా కమిటీ మాజీ చైర్మన్ ఎద్దు లక్ష్మణరావు పాల్గొన్నారు.

విజేతలకు సన్మానం

ఇచ్ఛాపురం : మండలంలోని కొత్తశాసనం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న విద్యార్థి కాంతాల స్నేహ రాష్ట్రస్థాయిలో పెన్సింగ్ క్రీడలో ద్వితీయ స్థానం సాధించారు. ఈ మేరకు ఎంపిపి బోర పుష్ప స్నేహకు మంగళవారం దుశ్శాలువ కప్పి సన్మానించారు. క్రీడలో రాణిస్తే మంచి భవిష్యత్ ఉంటుందన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపిపి కె.మోహనరావు, సర్పంచ్ కె.త్రినాథ్, హెచ్‌ఎం చిరంజీవి పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

ప్రజాశక్తి- రణస్థలం

తడిచిన, ముక్కిన ధాన్యాన్ని సైతం ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ అన్నారు. మండలంలోని వల్లభరావుపేట ఆర్‌బికెలో మంగళవారం ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జగనన్న ప్రభుత్వం ప్రతి ధాన్యపు గింజనూ మద్దతు ధరలో కొనుగోలు చేస్తుందని అన్నారు. రైతులు దళారులను నమ్మి మోసపోవద్దని సూచించారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి పిన్నింటి సాయికుమార్, జెడ్‌పిటిసి టొంపల సీతారాం, మహిళా అధ్యక్షులు గురాన మానస, మండల పంచాయతీ అధికారి ప్రభాకర్, అగ్రికల్చర్ ఎఒ విజయ్ భాస్కరరావు పాల్గొన్నారు.


ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కిరణ్‌కుమార్

జల జీవన్ మిషన్ పనులు వేగవంతం

శాసనసభ స్పీకర్ సీతారాం

ఆమదాలవలస : ప్రతి గడపకూ స్వచ్ఛమైన తాగునీరు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం పేర్కొన్నారు. స్పీకర్ క్యాంప్ కార్యాలయంలో జలజీవన్ మిషన్ పనులపై సంబంధిత అధికారులతో మంగళవారం సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ స్వచ్ఛమైన గాలి, నీరు, సంపూర్ణ పోషకాహారం ప్రతి ఒక్కరికీ కల్పించడం ద్వారా ఆరోగ్య ఆంధ్రప్రదేశ్‌గా తీర్చిదిద్దడమే సిఎం వై.ఎస్.జగన్మోహన్‌రెడ్డి సంకల్పమని అన్నారు. నియోజకవర్గంలోని నాలుగు మండలాలు మున్సిపాలిటీ పరిధిలో ప్రతి ఇంటికీ స్వచ్ఛమైన తాగునీరు కల్పనే లక్ష్యంగా, జల జీవన్ మిషన్ పథకం కార్యక్రమం అమలుకు సిఎం ఆమోదం తెలిపారని అన్నారు. ఇందులో భాగంగానే నియోజకవర్గంలో ప్రతి గ్రామంలోనూ దాదాపుగా పనులకు సంబంధించిన ప్రారంభ కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని అన్నారు. ఇప్పటివరకు పూర్తయిన వాటిని ప్రారంభించామన్నారు. ఎన్ని గ్రామాల్లో పనులు కొనసాగుతున్నాయో సంబంధిత శాఖ అధికారులను అడిగి తెలుసుకున్నారు. నిర్దేశిత సమయానికి పనులు పూర్తి కావాల్సిందేనని అధికారులకు తేల్చిచెప్పారు. పనులు జరుగుతున్న తీరుపై అధికారుల పర్యవేక్షణ అత్యంత ఆవశ్యకమని అన్నారు. నత్తనడకన పనులు చేపట్టే కాంట్రాక్టర్లు పనులు వేగవంతం అయ్యేందుకు సహకరించాలని కోరారు. ఇప్పటివరకు ప్రారంభించిన పనులు శత శాతం ఎప్పటికీ పూర్తి చేస్తారో స్పష్టత ఇవ్వాల్సిందేనని అన్నారు. పొందూరు మండలానికి నాగావళి నది నుంచి నీటిని లిఫ్ట్ చేసి శుద్ధి చేసిన జలాన్ని ప్రతి ఇంటికీ అందించడమే ప్రధాన ఉద్దేశం అన్నారు. కార్యక్రమంలో ఎస్‌ఇ టి.శ్రీనివాస్‌ప్రసాద్, డిఇ లలితకుమారి, నాలుగు మండలాల ఎఇలు పాల్గొన్నారు.


సమీక్షిస్తున్న స్పీకర్ సీతారాం

మండల బడ్జెట్ ఆమోదం


మాట్లాడుతున్న ఎంపిడిఒ సురేష్ కుమార్

లావేరు: లావేరు మండలం 2024-25 అంచనా బడ్జెట్‌ను లావేరు మండల పరిషత్ సభ్యులు ఆమోదించారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిపి లుట్ట అమ్మజమ్మ అధ్యక్షతన మంగళవారం బడ్జెట్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ కుప్పలి సురేష్ కుమార్ సభలో బడ్జెట్ వివరాలను చదివి సభ్యులకు వినిపించారు. లావేరు మండల ప్రజా పరిసత్ 2023-24 సవరణ బడ్జెట్ ఆదాయం రూ.61,14,370 కాగా, వ్యయం రూ.54,38.640, మిగులు రూ.6,75,730 అని వెల్లడించారు. అలాగే 2024-25 అంచనా బడ్జెట్ ఆదాయం రూ.66,14,470 వ్యయం కాగా, రూ.60,2,721 మిగులు, రూ.6,11,749 అని చదివి వినిపించారు. దీనిని సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదించారు. సమావేశంలో మండల ప్రత్యేక ఆహ్వానితులు రొక్కం బాలకృష్ణ, జెడ్‌పిటిసి మీసాల సీతంనాయుడు ఎంపిడిఒ సురేష్‌కుమార్, జెసిఎస్ ఇన్‌ఛార్జి మీసాల శ్రీనివాసరావు, సీనియర్ అసిస్టెంట్ మాధవరావు, ఎంపిటిసిలు జె.భానోజీ రావు, నారాయణరావు, చిరంజీవి పాల్గొన్నారు.

నిధుల పెంపుతో పేదలకు మేలు

ప్రజాశక్తి- కవిటి

ఆరోగ్యశ్రీ పరిధిలో రోగులకు చేస్తున్న ఖర్చు పరిమితిని రూ.25 లక్షలకు పెంచడం ద్వారా రాష్ట్రంలోని వేలాది మంది పేదలకు మేలు చేకూరుతుందని ఎమ్మెల్సీ నర్తు రామారావు అన్నారు. ఈ మేరకు మండలంలోని కొత్తపుట్టుగలో ముఖ్యమంత్రి జగన్ చిత్రపటానికి మంగళవారం పాలాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సిఎం తీసుకున్న నిర్ణయం ద్వారా రాష్ట్రంలోని 1.48 కోట్ల కుటుంబాల్లోని 4.25 కోట్ల మంది లబ్ధిదారులకు మేలు జరుగుతుందన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపిపి నర్తు చామంతి, నర్తు శివాజీ పాల్గొన్నారు.

జగన్‌తోనే రాష్ట్రాభివృద్ధి

పోలాకి : సిఎం జగన్మోహన్‌రెడ్డితోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని ఎంపిపి ప్రతినిధి ముద్దాడ బైరాగి నాయుడు అన్నారు. మండలంలోని గొల్లవలసలో ఎపికి జగనే ఎందుకు కావాలి కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సిఎం జగన్ అధికారంలోకి వచ్చిన తర్వాత సంక్షేమ పథకాల ద్వారా లబ్ధిదారులకు నేరుగా వారి అకౌంట్‌లోకి డబ్బులు అందిస్తున్నారని అన్నాడు. గాంధీజీ కళలు కన్న గ్రామ స్వరాజ్యం జగన్‌నే సాధ్యమన్నారు. కార్యక్రమంలో జెసిఎస్ మండల కన్వీనర్ కణితి సత్తిబాబు, మండల యువజన విభాగం అధ్యక్షుడు రెంటికోట త్రినాథరావు, మండల ఎస్‌సి సెల్ అధ్యక్షులు కల్లేపల్లి లక్షణరావు, సర్పంచ్ పి.జగన్, ఎంపిటిసి ప్రతినిధి సూరపు జయరాం పాల్గొన్నారు.



పోలాకి : మాట్లాడుతున్న బైరాగినాయుడు

సోంపేట: సోంపేట సచివాలయం మూడు పరిధిలో మంగళవారం ఎపికి జగనే ఎందుకు కావాలి కార్యక్రమాన్ని ఎంపిపి డాక్టర్ దాసు ఆధ్వర్యాన చేపట్టారు. కార్యక్రమంలో వైసిపి జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో సర్పంచ్ నగిరి ప్రభావతి, తహశీల్దార్ సత్యనారాయణ, ఎంపిడిఒ వెంకటరమణ, నాయకులు భాస్కరరావు, శ్రీకృష్ణ, చంద్రశేఖర్, ఢిల్లీ, సురేష్, పాపారావు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఆర్‌డి నాగరాజు

పన్నుల వసూళ్లపై ప్రత్యేక దృష్టి

రీజనల్ డైరెక్టర్ నాగరాజు

పలాస : పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలోని ఇంటి, ఆస్తి పన్నులు వసూళ్లు వేగవంతం చేయాలని విశాఖపట్నం రీజియన్ డైరెక్టర్ నాగరాజు అన్నారు. పలాస మున్సిపల్ కార్యాలయంలో సచివాలయాల అడ్మిన్లతో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పన్నుల వసూళ్లపై ప్రచారం నిర్వహించాలన్నారు. వంద శాతం పన్నుల వసూళ్లకు సచివాలయం సిబ్బందే బాధ్యత వహించాలన్నారు. సచివాలయ వారిగా సమీక్షిస్తున్న సందర్భంలో చినబాడాం సచివాలయం అడ్మిన్ వాలంటీర్లతో కలిసి పన్నులు వసూళ్లు చేస్తున్నామని చెప్పడంతో ఆర్‌డి ఆగ్రహం వ్యక్తం చేశారు. పన్నుల వసూళ్లకు వాలంటీర్లకు సంబంధం ఏమిటని ప్రశ్నించారు. సమావేశంలో కమిషనర్ నాగేంద్రకుమార్, డిఇ సునీల్‌కుమార్, ఎఇ అవినాష్, ఆర్‌ఒ అప్పలస్వామి, ఆర్‌ఐ అమర్‌నాథ్ పాల్గొన్నారు.

బాపిరాజుపేటలో పశువైద్య శిబిరం

పొందూరు: మండలంలోని బానాం పంచాయతీ బాపిరాజుపేటలో పశు వైద్యాధికారి డాక్టర్ దివ్య ఆధ్వర్యాన మంగళవారం పశువైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా పశువులకు గర్భకోశ, చూలు, పొదుగు వాపు పరీక్షలు చేశారు. నట్టల మందు దూడలకు వేశారు. కార్యక్రమంలో పాడి రైతులు, రిలయన్స్ ప్రతినిధులు పాల్గొన్నారు.


ఆవును పరీక్షిస్తున్న వైద్యాధికారి దివ్య

వ్యవసాయ సహాయాధికారిపై కేసు

కోటబొమ్మాళి: మండలం జీయన్నపేట రైతు భరోసా కేంద్రంలో వ్యవసాయశాఖ సహాయాధికారిగా పనిచేస్తున్న దున్న అప్పన్నపై అదే గ్రామానికి చెందిన బమ్మిడి శ్రీనివాసరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్‌ఐ షేక్‌మహమ్మద్ అలీ మంగళవారం తెలిపారు. శ్రీనివాసరావు పండించిన 38 బస్తాల ధాన్యం విక్రయించేందుకు రైతు భరోసా కేంద్రానికి తీసుకెళ్లగా... ధాన్యం బాగులేవని, వీటిని కొనుగోలు చేసే పరిస్థితి లేదని అప్పన్న చెప్పారని అన్నారు. దీంతో వారిద్దరి మధ్య వాగ్వివాదం చోటు చేసుకుందని తెలిపారు. దీంతో అప్పన్న కోపోద్రిక్తుడై ధాన్యం పరిశీలించే ఇనుప రాడ్డుతో శ్రీనివాసరావుపై దాడి చేశారని, వెంటనే స్థానికులు 108లో టెక్కలి జిల్లా ఆస్పత్రికి తరలించారని అన్నారు. క్షతగాత్రుడు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్‌ఐ తెలిపారు.


నూతన కార్యవర్గ సభ్యులతో రాజు

నూతన విద్యా విధానాన్ని రద్దు చేయాలి

ప్రజాశక్తి- పొందూరు

విద్యార్థులను చదువుకు దూరం చేసే నూతన జాతీయ విద్యా విధానాన్ని ప్రభుత్వం వెంటనే రద్దు చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు చిట్టిరి రాజు డిమాండ్ చేశారు. పొందూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణంలో మంగళవారం ఎస్ఎఫ్ఐ మండల మహాసభలు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ డిగ్రీ విద్యార్థులకు పెంచిన ఫీజులు తగ్గించాలి, హాస్టల్ మెస్ బిల్లులు పెంచాలి, ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం మండల అధ్యక్ష, కార్యదర్శులుగా సంధ్య, వెంకటలక్ష్మి, కమిటీ సభ్యులుగా లలిత, శ్రావణి, బిందు, దినేష్ తదితరులను ఎన్నుకున్నారు.

ఆ సరుకులు అంగన్వాడీవి కావు

వజ్రపుకొత్తూరు : ఇటీవల పట్టుబడిన బియ్యం మండలంలోని అక్కుపల్లి అంగన్వాడీ కేంద్రానికి కావని కాశీబుగ్గ ఐసిడిఎస్ ప్రాజెక్టు పిఒ డి.శార్వాణి అన్నారు. ఈ మేరకు మంగళవారం అంగన్వాడీ కేంద్రంలో విచారణ చేపట్టారు. టిహెచ్ఆర్, ఎఫ్‌సిఆర్ రికార్డులను పరిశీలించి స్టాకు వివరాలు సరిచేశామన్నారు. ఈ ఏడాది ఆగస్టు నుంచి డిసెంబరు వరకు బియ్యం స్టాక్‌లో ఎటువంటి తేడాలు కనిపించలేదని చెప్పారు. పంచాయతీ కార్యదర్శి లండ రాజేష్, డిఎ మెరుపల్లి రాజేష్‌లు ఆదివారం పట్టుకున్న బియ్యం వ్యాపారి టి.రాజారావు గ్రామంలో సేకరించిన రేషన్ బియ్యంగా తేల్చామని అన్నారు. ఆమెతో పాటు అంగన్వాడీ సూపర్‌వైజర్లు పి.గంగమ్మ, లత ఉన్నారు.


చెక్కును అందజేస్తున్న వెంకటరావు చిట్టి

రైతులకు అండ

ప్రజాశక్తి- పలాస

రైతులకు ప్రభుత్వం అండగా ఉంటుందని, పంటల కోసం పిఎసిఎస్ ద్వారా రుణాలు మంజూరు చేస్తున్నామని పలాస పిఎసిఎస్ అధ్యక్షులు పైల వెంకటరావు చిట్టి అన్నారు. పలాస పిఎసిఎస్ కార్యాలయంలో మంగళవారం పిఎసిఎస్ ద్వారా రూ.13 లక్షల చెక్కలను రైతులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాజగోపాలపురానికి చెందిన బమ్మిడి రాజారావుకు రూ. 8 లక్షలు, మున్సిపాలిటీ పరిధిలో తాళభద్రకు చెందిన రాజాం ప్రసాదరావుకు రూ.5 లక్షల చెక్కలను పంపిణీ చేశామని తెలిపారు. కార్యక్రమంలో పిఎసిఎస్ సిఇఒ తలసముద్ర శ్రీనివాసరావు, డిసిసిబి బ్యాంకు మేనేజర్ డి.కృష్ణారావు, సూపర్‌వైజర్ ఎర్రయ్య, పిఎసిఎస్ సిబ్బంది శ్రీనివాసరావు, విజయ్ పాల్గొన్నారు.


లోకేష్‌తో పాపారావు

లోకేష్‌ను కలిసిన పాపారావు

ప్రజాశక్తి- ఆమదాలవలస

యువగళం పాదయాత్రలో టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్‌ను జనసేన సీనియర్ నాయకులు, విశ్రాంత రీజనల్ జాయింట్ డైరెక్టర్ పాత్రుని పాపారావు మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆమదాలవలస నియోజకవర్గ జనసేన, టిడిపి పార్టీల ఉమ్మడి కార్యాచరణపై లోకేష్ విశ్లేషించినట్లు పాపారావు తెలిపారు. టిడిపి, జనసేన పార్టీ అభ్యర్థుల విజయానికి ప్రజల్లోకి వెళ్లి విస్తృతంగా ప్రచారం చేయాలని కోరినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీ కింజరాపు రామ్మోహన్ నాయుడు, జనసేన సమన్వయకర్త పేడాడ రామ్మోహనరావు, పైడి మురళీమోహన్ పాల్గొన్నారు.


ఆరోగ్యశ్రీ కార్డును అందజేస్తున్న వాణి

ఆరోగ్యశ్రీ కార్డుల పంపిణీ

ప్రజాశక్తి- టెక్కలి రూరల్

మేజర్ పంచాయతీ టెక్కలి సచివాలయం-1 పరిధిలో అరోగ్యశ్రీ కార్డును నియోజవర్గం సమన్వయకర్త దువ్వాడ వాణి మంగళవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సిఎం జగన్ ఆరోగ్యశ్రీ రూ.25 లక్షలకు పెంచడం జగనన్నకు ప్రజలు రుణపడి ఉంటారని అన్నారు. ఎంత కీలకమైన జబ్బులైన రూ.25 లక్షలు బాగు చేసుకోవచ్చని తెలిపారు. పేద ప్రజలకు ఆరోగ్యంపై జగనన్న చూపిన ప్రేమ ఎంత ఆనందదాయకమని అన్నారు. ఈ కార్డుతో కార్పొరేట్ ఆస్పత్రిలో వైద్యం చేసుకోవచ్చని తెలిపారు. కార్యక్రమంలో వైస్ ఎంపిపి మున్నెల కిషోర్, మండల ప్రత్యేక ఆహ్వానితులు నాగళ్ల శంకరరావు, కూన పార్వతి, వాకాడ శ్రీధర్‌రెడ్డి, యర్ర అనంతయ్య, సర్పంచ్‌లు బగాది రామకృష్ణ, మురి శంకర్, గండి అప్పలరెడ్డి పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలకు జన నీరాజనం

శాసనసభ స్పీకర్ సీతారాం


లబ్ధిదారులతో మాట్లాడుతున్న స్పీకర్ సీతారాం

ప్రజాశక్తి- ఆమదాలవలస
వైసిపి అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ప్రజలకు అందిస్తున్న సంక్షేమ పథకాలకు ప్రజలు జన నీరాజనం పడుతున్నారని శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. మండలంలోని తోటాడ సచివాలయం పరిధిలోని అక్కివరం, గోపినగరం గ్రామాల్లో మంగళవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ముందుగా గ్రామంలో గడప గడపకు వెళ్లి ఈ ప్రభుత్వంలో అందిన సంక్షేమ పథకాల లబ్ధిని లబ్ధిదారులకు వివరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తున్నానని అన్నారు. ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలను గడప గడపకు అందిస్తున్నారని అన్నారు. ప్రజా సమస్యలు ఏమైనా ఉంటే తన దృష్టికి తీసుకురావాలని తెలిపారు. సచివాలయాల ద్వారా ప్రజల ముంగిటకు పాలనను తీసుకువచ్చారని అన్నారు. కార్యక్రమంలో పిఎసిఎస్ అధ్యక్షులు గురుగుబెల్లి శ్రీనివాసరావు, సర్పంచ్ గురుగుబెల్లి జయ, ఎంపిటిసి ప్రతినిధి తాండ్ర ధనుంజయరావు, గురుగుబెల్లి నీలారావు, నవీన్, సర్పంచ్‌లు ఎన్ని రామచంద్రరావు, బెండి దశరథ, ఎంపిడిఒ ఎస్.వాసుదేవరావు, మండల ఎఒ మెట్ట మోహనరావు, విద్యుత్‌శాఖ ఎఇ రవికుమార్, ఆర్‌డబ్ల్యుఎస్ జెఇ చంద్రమౌళి, ఎపిఒ సురవరపు లక్ష్మీనరసమ్మ పాల్గొన్నారు.


సిసి రోడ్డును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే అశోక్

మౌలిక వసతుల కల్పనకు కృషి

ప్రజాశక్తి- కవిటి
గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తున్నామని ఎమ్మెల్యే బెందాళం అశోక్ అన్నారు. మండలంలోని బొరివంకలో రూ.10 లక్షల ఎంపీ నిధులతో నిర్మించిన సిసి రోడ్డును మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మాజీ ఎంపీ ఎర్రన్నాయుడు వారసత్వాన్ని ప్రస్తుత ఎంపీ రామ్మోహన్ నాయుడు కొనసాగిస్తున్నారని కొనియాడారు. ఇచ్ఛాపురం నియోజకవర్గంలో ఏ మారుమూల ప్రాంతానికి వెళ్లినా ఎంపీ నిధులతో చేపట్టిన ఏదో ఒక కార్యక్రమం కనిపిస్తుందని అన్నారు. భవిష్యత్‌లో రాబోయేది టిడిపి జనసేన ప్రభుత్వమేనని, మళ్లీ అప్పుడు పూర్తిస్థాయిలో రాష్ట్రంలో అభివృద్ధి కార్యక్రమాలు చేపడతామని చెప్పారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు పొందల కృష్ణారావు, మనిచంద్ర ప్రకాష్, బెందాళం రమేష్, బెందాళం విజయ్, బాసుదేవ్ రౌలో, బార్ల చినబాబు పాల్గొన్నారు.

విద్యార్థులకు నగదు పురస్కారం

ప్రజాశక్తి- పలాస
మండలంలోని బ్రాహ్మణతర్ల ఉన్నత పాఠశాలలోని పదో తరగతి ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు నగదు పురస్కారం అందించారు. గతేడాది పదో తరగతి పబ్లిక్ పరీక్షల ఫలితాల్లో ప్రథమ, ద్వితీయ స్థానాలు సాధించిన టి.జ్యోషిక, ఎస్.రేష్మ, తల్లిదండ్రులకు ఇదే పాఠశాలలో పనిచేసి విశ్రాంత ఉపాధ్యాయులు రంప అనంత శర్మ మెమోరియల్ స్కాలర్‌షిప్ కింద రూ.2, రూ.వెయ్యి నగదు పురస్కారాన్ని మంగళవారం అందజేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు కె.వైకుంఠరావు, రంప అనంత శర్మ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.


బోరు బావి పనులను ప్రారంభిస్తున్న ఉమామహేష్

ఇంటింటికీ తాగునీరు

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు
ఇంటింటికీ తాగునీటి సదుపాయం అందుబాటులోకి తీసుకొస్తామని గోవిందపురం సర్పంచ్ పాలిన ఉమామహేశ్వరరావు అన్నారు. పంచాయతీ పరిధిలోని గునాలాపాడులో రూ.లక్షన్నర పంచాయతీ నిధులతో బోరు బావి నిర్మాణ పనులను మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పంచాయతీలో ఎక్కడా తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకున్నామన్నారు. సుజలధార పథకం ద్వారా ఇంటింటికీ తాగునీటి కుళాయి ఏర్పాటు చేసి శుద్ధ జలం అందిస్తామని అన్నారు. కార్యక్రమంలో చిలకయ్య, పాపా రావు, గణపతి, సింహాచలం, రాంబాబు పాల్గొన్నారు.

సెల్‌ఫోన్లకు దూరంగా ఉండాలి

నౌపడ : టివిలకు, ఫోన్లకు దూరంగా ఉండాలని దండుగోపాలపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం కోగ చైతన్య కోరారు. పాఠశాల ఆవరణలో పదో తరగతి విద్యార్థుల తల్లిదండ్రులతో మంగళవారం సమావేశం నిర్వహించారు. మరో మూడు నెలల్లో పరీక్షలు వస్తుండడంతో విద్యార్థులపై తల్లిదండ్రులు జాగ్రత్త వహించాలని పలు సూచనలు చేయాలన్నారు. ఉపాధ్యాయులు, పేరెంట్స్ కమిటీ చైర్మన్ పాల్గొన్నారు.

విజేతకు బహుమతి ప్రదానం

పోలాకి : నరసన్నపేట మిలీనియం లయన్స్ క్లబ్ ఆధ్వర్యాన గత నెల 19న నిర్వహించిన పీస్ పోస్టర్ కాంటెస్ట్ పోటీ పరీక్షల్లో ప్రథమ బహుమతి సాధించిన వి.తేజస్వినికి లయన్స్ ఇంటర్నేషనల్ బహుమతి, ప్రశంసాపత్రం అందజేశారు. దీనిని నరసన్నపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మంగళవారం అందజేశారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షులు సదాశివుని కృష్ణ, జోన్ చైర్మన్ వి.రంగనాథ్, కార్యదర్శి వి.నాగరాజు, ట్రెజరర్ పి.రమేష్, హైస్కూల్ హెచ్‌ఎం పి.వెంకటరావు, ఉపాధ్యాయులు సాయి, శ్రీనివాసశర్మ, రాజేంద్రనాయుడు, బాగాది వెంకటరావు పాల్గొన్నారు.

వరికుప్ప దగ్ధం

నందిగాం : మండలంలోని పాతినవాడిపేటకు చెందిన రైతు కణితి నందేసుకు చెందిన 50 సెంట్లు వరి కుప్ప మంగళవారం అగ్నిప్రమాదంలో దగ్ధమైంది. పొలం సమీపంలోని చెరువులో కొంతమంది మంటలు పెట్టడంతో అది అటుగా వ్యాపించి వరికుప్పకు అంటుకుంది. ఈ ప్రమాదంలో రూ.20 వేలు వరకు ఆస్తినష్టం వాటిల్లింది. సమాచారం అందుకున్న టెక్కలి అగ్నిమాపక అధికారి ఎస్.మల్లేశ్వరరావు శకటంతో వచ్చి మంటలను అదుపు చేశారు.

కరువు జిల్లాగా ప్రకటించాలి

పర్లాకిమిడి : పర్లాకిమిడి జిల్లాను కరువు జిల్లాగా ప్రకటించాలని నవ నిర్మాణ కృషక సంఘం అఖద్ దేవ్ నంద డిమాండ్ చేశారు. ఈ మేరకు పర్లాకిమిడి ఫారెస్టు గేట్ వద్ద మంగళవారం ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పత్తి క్వింటాకు రూ.12 వేలు, ధాన్యం క్వింటాకు రూ.3 వేలు చొప్పున ప్రభుత్వం కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు.

రేపు సిఎం జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్
ఈ నెల 21న ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి పుట్టిన రోజు వేడుకలు నిర్వహిస్తున్నామని, కార్యకర్తలు తరలిరావాలని వైసిపి జిల్లా అధ్యక్షులు ధర్మాన కృష్ణదాస్ ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. ఈ వేడుకల్లో భాగంగా రక్తదాన శిబిరాలు, అనాథలకు, వృద్ధులకు, వృద్ధాశ్రమల్లో ఉన్న వారికి పళ్లు, దుస్తులు పంపిణీ చేశామని తెలిపారు.
రణస్థలం: ఈ నెల 21న ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్మోహన్‌రెడ్డి జన్మదినం వేడుకలను నిర్వహిస్తున్నామని, కార్యకర్తలు, అభిమానులు పాల్గొని విజయవంతం చేయాలని ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ పిలుపు నిచ్చారు. ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆ రోజు ఉదయం 10 గంటల నుంచి రామతీర్థం జంక్షన్ వద్ద కేక్ కటింగ్, మెగా రక్తదాన శిబిరం, ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రోగులకు పళ్ల పంపిణీ చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో లావేరు మండలం ఎంపిపి ప్రతినిధి రొక్కం బాలకృష్ణ, జెడ్‌పిటిసిలు టొంపల సీతారాం, మీసాల సీతంనాయుడు, కాయల రమణ, మండల పార్టీ అధ్యక్షులు మహంతి పెద్దరామునాయుడు, దన్నాన రాజినాయుడు, ముద్దాడ శంకర్, జెసిఎస్ ఇన్‌ఛార్జి చిల్ల వెంకటరెడ్డి పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎమ్మెల్యే కిరణ్ కుమార్

విద్యార్థులకు అభినందనలు


అభినందిస్తున్న ఉపాధ్యాయులు

నందిగాం: బీహార్ రాష్ట్రం పాట్నాలో ఫిబ్రవరి నెల 2,3,4 తేదీల్లో జరిగిన జాతీయస్థాయి పోటీలకు నందిగాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు వై.హరిబాబు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 12,13,14 తేదీల్లో పల్నాడు జిల్లా నరసరావుపేటలో జరిగిన రాష్ట్రస్థాయి ఎస్‌జిఎఫ్ క్రీడా పోటీల్లో నందిగాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు బి.మోక్ష, గజరాపుఅభిరాములు బహుమతులు సాధించారని అన్నారు. 1500, 3000 మీటర్ల పరుగు పందెంలో బి.మోక్ష రాష్ట్రస్థాయిలో ప్రథమ స్థానాన్ని సాధించాడన్నారు. 400 మీటర్ల హార్డిల్స్ లో ప్రథమ స్థానం, 400 మీటర్ల పరుగు పందెంలో ద్వితీయ స్థానం ఇదే పాఠశాలకు చెందిన జి.అభిరామ్ సాధించినట్లు చెప్పారు. పాఠశాలకు రాష్ట్రస్థాయిలో గుర్తింపు తెచ్చిన విద్యార్థులకు హెచ్‌ఎంతో పాటు వ్యాయామ ఉపాధ్యాయులు జి.శ్రీనివాసరావు, గ్రామస్తులు అభినందనలు తెలిపారు.


ఆర్థికసాయం అందజేస్తున్న మాధవరావు

వైఎస్ఆర్ బీమా పేదలకు వరం

పలాస: కుటుంబంలో ఇంటి పెద్ద దిక్కు మృతి చెందితే ఆ కుటుంబం రోడ్డున పడకుండా ఉండాలనే ఉద్దేశంతో ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్మోహన్‌రెడ్డి వైఎస్ఆర్ బీమా పథకాన్ని ప్రవేశ పెట్టారని, ఈ పథకం పేదలకు వరమని పిఎసిఎస్ మాజీ అధ్యక్షులు చింతాడ మాధవరావు, అగ్రికల్చర్ అడ్వయిజరీ బోర్డు చైర్మన్ గొరెల వేణుగోపాల్ అన్నారు. మండలంలోని అల్లుకోలలో ఎస్.సురేంద్ర అనారోగ్యంతో ఇటీవల మృతి చెందడంతో అంత్యక్రియలు నిమిత్తం మంగళవారం రూ.10 వేలు ఆయన భార్య భానుమ్మకు అందజేశారు. వారితో పాటు సర్పంచ్ ప్రతినిధి దువ్వాడ రవి కుమార్, కె.శ్రీనివాస్, వార్డు మెంబరు తారకేశ్వరరావు, సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్ దిలీప్ పాల్గొన్నారు.

కిడ్నీ రోగులకు ఉచిత రవాణా కల్పించాలి

పలాస : ప్రభుత్వాస్పత్రుల్లో డయాలసిస్ చేసుకుంటున్న కిడ్నీ రోగులకు ఇరువైపులా ప్రభుత్వమే ఉచిత రవాణా సౌకర్యం కల్పించాలని జనసేన పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ దుర్గారావు కోరారు. ఈ మేరకు ఎన్నారై మిషన్ ఉద్దానం సభ్యులు సాధనాల స్వామి ప్రముఖ్, సాధనాల రామకృష్ణలు, దుర్గారావు సమక్షంలో పలాస 200 పడకల ఆస్పత్రి, హరిపురం డయాలసిస్ సెంటర్ లోడయాలసిస్ చేసుకుంటున్న ఉద్దాన కిడ్నీ రోగులకు ఉచితంగా ఎరిత్రోపోయిటెన్ ఇంజక్షన్లను మంగళవారం ఉచితంగా అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గత ప్రభుత్వంలో ఇచ్చిన ఉచిత మందులను నిలిపివేయడంతో రోగులు చాలా ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మందస మండల అధ్యక్షులు కుప్పాయి గోపాలరావు, దువ్వాడ వంశీ చౌదరి, కోన కృష్ణారావు, నందిగాం ధర్మారావు, దినేష్ కుమార్ పాల్గొన్నారు.


ఇంజక్షన్‌ను అందజేస్తున్న డాక్టర్ దుర్గారావు

పేదలకు దుప్పట్లు పంపిణీ

వజ్రపుకొత్తూరు : శీతాకాలం చలి గాలులు ఉధృతంగా ఉండడంతో రోడ్డు పక్కన, చెట్టు కింద తలదాచుకుంటున్న 30 మంది వృద్ధులకు, పేదలకు ఉద్దానంలోని మైటీ సేవా సంస్థ మంగళవారం దుప్పట్లు పంపిణీ చేసింది. దుప్పట్లు కొనుగోలుకు విరాళం ఇవ్వడానికి ముందుకు వచ్చిన దాతలకు ధన్యవాదములు తెలిపారు. కార్యక్రమంలో సంస్థ సభ్యులు ఇరోతు రాంకీ, ఉప్పరపల్లి సతీష్, కొర్నాన నరేష్, మదనాల ఆశీష్, గోవిందస్వామి పాల్గొన్నారు.


దుప్పట్లను పంపిణీ చేస్తున్న సభ్యులు

హనుమాన్ ట్రైలర్ విడుదల


ట్రైలర్‌ను విడుదల చేస్తున్న టైకూన్ సాయి

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్
వర్ధమాన నటుడు, హీరో తేజా సజ్జ నటించిన హనుమాన్ చిత్రం ట్రైలర్‌ను నగరంలోని ఎస్‌విసి థియేటర్‌లో మంగళవారం విడుదల చేశారు. సినీ అభిమానులు ఆర్ట్ టైకూన్ సాయి, కెమెరామెన్ హేమ సుందర్, భాస్కర్‌వర్మవివేక్, తులసిలు పాల్గొని మాట్లాడారు. హీరో తేజా బాల నటుడిగా అనేక చిత్రాల్లో నటించారన్నారు. ఈ సినిమాలో ఆయనతో పాటు అమితా అలయార్ హీరోయిన్‌గా నటిస్తున్నారని, జనవరి 12న థియేటర్లలో సినిమాను విడుదల చేస్తున్నట్లు తెలిపారు ఈ సినిమా అందరినీ ఆకట్టుకుంటుందని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎస్‌విసి థియేటర్ మేనేజర్ రవి పాల్గొన్నారు.